విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

పెద్దపల్లి, జూన్14: పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ ఆఫీసు నుంచి పెండింగ్ ధరణి అర్జీలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ముందు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. ఇప్పుడు మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. సక్సెషన్, మ్యూటేషన్‌ను వెంటనే చేయాలని నిర్దేశించారు. ధరణి వెబ్ సైట్‌కు సంబంధించి జీఎల్ఎం, టీఎం 33 దరఖాస్తుల్లో డిజిటల్ సంతకాల ప్రక్రియలో మార్పులు చేస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని కోరారు. పెద్దపల్లి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల, తహసీల్దార్ల స్థాయిల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వచ్చే గురువారం నాటికి ధరణి పరిష్కరిస్తామని తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం మండలాల్లో ఎక్కువగా పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని వెల్లడించారు. రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు భవనం గుర్తించామని, అదేవిధంగా పెద్దపల్లిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు అందుబాటులో ఉన్న పంచాయతీ భవనాన్ని కేటాయిస్తామని తెలిపారు.

15 రోజుల్లోగా ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి

టాస్క్ భవనం ఆధునీకరణ పనులు 15 రోజుల్లో పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని టాస్క్ భవనాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పనుల పురోగతిని తెలుసుకున్నారు. జూలై 15 నుంచి టాస్క్ భవనంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ మేనేజర్ గంగా ప్రసాద్, పంచాయతీ రాజ్ పెద్దపల్లి డీఈ శంకరయ్య ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు..

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అభినందించారు. మే 19న గోవాలో యూనివర్సల్ 369 షోటోకాన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ – 24 పోటీల్లో కాల్వ శ్రీరాంపూర్ మండలం జడ్పీహెచ్ఎస్ వెన్నంపల్లి స్కూల్ 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ వైష్ణవి, నిహారిక , ఈ శ్రీనిత , ఈ శ్రీహర్షిని, 10వ తరగతి చదువుతున్న నిదర్శిని పతకాలు సాధించారు. రామగుండం సెక్రెటెడ్ హార్ట్ హై స్కూల్ విద్యార్థి అమృత్ సాయి మలేషియాలో నిర్వహించిన పదో అంతర్జాతీయ ఒకినవా గోజిర్యూ ఎపోసిటీ కరాటే చాంపియన్‌షిప్ అండర్–16లో బంగారు పతకం సాధించారని కరాటే మాస్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాస్, కరాటే మాస్టర్ కాల్వ రమేష్, కరాటే డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ మొండయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

పెద్దపల్లి కమాన్ : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే, డీఈవో

కాల్వశ్రీరాంపూర్: చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

- ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

పెద్దపల్లి కమాన్, జూన్ 14 ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు స్కూళ్లలో చేర్పించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పట్టణంలోని అమర్‌నగర్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ఎమ్మెల్యే శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలో నిర్మించిన రీడింగ్ కార్నర్ రూమ్, తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఐవీపీ ప్యానెల్స్‌ను ప్రారంభించారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సహకారం అందిస్తానని అన్నారు. లైబ్రరీని పరిశీలించిన ఎమ్మెల్యే పుస్తకాల కొనుగోలుకు రూ.10వేలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో డీఈవో డీ మాధవి, ఎంఈవో సురేందర్, హెచ్ఎం మంజులత, జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడిపల్లె లో అక్షరాభ్యాసం

కాల్వశ్రీరాంపూర్, జూన్14: మడిపల్లె ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. హెచ్ఎం గుండ మల్లికార్జున్, టీచర్ కవిత, అంగన్ వాడీ టీచర్ స్వరూప, మాజీ సర్పంచ్ అడిగొప్పుల రాణి, గ్రామస్తులు ఉన్నారు.

సాయంపేటలో

ధర్మారం,జూన్14: సాయంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సహ ఉపాధ్యాయుడు కాట నరసయ్య, చైర్‌పర్సన్ ఎన్ ప్రమీల,అంగన్‌వాడీ టీచర్ బద్దం భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల కార్మికులు కాదు.. బడి పిల్లలే

పెద్దపల్లి, జూన్14(నమస్తే తెలంగాణ): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు పలు సమస్యల నడుమ తెరుచుకున్నాయి. పలక బలపం... పెన్సిల్, పెన్ను పట్టుకోవాల్సిన విద్యార్థులు బడిలో బాలకార్మికులుగా మారారు. స్వీపర్లు చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. పెద్దపల్లిలోని అమర్ నగర్ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీకి స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వస్తున్న సందర్భంలో ఉపాధ్యాయులు వేదిక వద్దకు విద్యార్థులతో బెంచీలు వేయించారు. ఎమ్మెల్యే రాగానే బెంచీలను మోయించడం ఆపేశారు. ఇక్కడి ఉపాధ్యాయుల పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి. జిల్లాలో 559 ప్రభుత్వ పాఠశాలలుండగా, 29753 మంది విద్యార్థులున్నారు. దాదాపు అన్ని పాఠశాలల్లో ఇదే తంతు కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పెద్దపల్లి జిల్లా ఎన్జీవో నాయకులు

పెద్దపల్లి, జూన్14: టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేన్, ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ముజీబ్ హుస్సేన్‌ను పెద్దపల్లి జిల్లా టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు బొంకూరి శంకర్, సందీప్‌రావు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మణ్‌రావు, ప్రవీణ్, సుదర్శన్, శశిధర్, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంథని ప్రీమియర్ లీగ్ ప్రారంభం

క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న శ్రీను బాబు

మంథని, జూన్ 14: మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం మంథని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ప్రారంభించారు.క్రీడాకారులను పరిచయం చేసుకొని టీ షర్టులు పంపిణీ చేశారు. క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

సాదాసీదాగా బల్దియా సమావేశం

పెద్దపల్లి, జూన్14: పెద్దపల్లి బల్దియా సాధారణ సమావేశం సాదాసీదాగా జరిగింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని 36 వార్డుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటేషన్ సిబ్బందికి అవసరమైన పరికరాలు, సామగ్రి, రెయిన్ కోర్ట్స్ తదితర అంశాలపై పాలక వర్గం చర్చించింది. అంతకముందు 4వ వార్డు కాన్సిలర్ కొంతం శ్రీనివాస్‌రెడ్డి మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిలర్లు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కౌన్సిల్‌లో ప్రవేశ పెట్టిన 42 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్పర్సన్ నజ్మీన్ సుల్తానా మోబిన్, కౌన్సిలర్లు, కో –ఆప్షన్ సభ్యులు, మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

యైటింక్లయిన్ కాలనీ,జూన్ 14: సింగరేణి సేవా సమితి ద్వారా వివిధ వృత్తి శిక్షణ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఆర్జీ–2 సేవా అధ్యక్షురాలు మాలతీ సూర్యనారాయణ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాలులో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశారు. 271 మందికి శిక్షణ ఇవ్వగా 180 మంది మహిళలు పరీక్షలు రాసి సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, ఏఐటీయూసీ సెక్రెటరీ రవిందర్, డీజీఎం రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, సుజాత రాజేంద్ర ప్రసాద్, ఎస్వో షరీఫ్ మహ్మద్, సేవా సభ్యులు పాల్గొన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 14: సింగరేణి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త గనుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే టెండర్లలో పాల్గొనేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. ఓసీపీ–3 కృషి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘంగా గెలిచిన తమ యూనియన్‌కు గుర్తింపు పత్రం ఇచ్చి కార్మిక సమస్యలపై చర్చించేందుకు స్ట్రక్చర్ మీటింగ్‌లు, జేసీసీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రకాశ్, వైవీ రావు, రాజారత్నం, రాంచందర్, రవీందర్, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, రవికుమార్, మహేంద్, తిరుపతి, వెంకటేశ్, సదయ్య, గట్టయ్య, సంపత్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా చర్యలు

పెద్దపల్లి, జూన్14: పెద్దపల్లి సర్కిల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నామని పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బొంకూరి సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపం, విద్యుత్ వినియోగదారుల గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం, రైతులు స్విచ్ బోర్డు /మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వలన విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు భద్రత పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తూ వారికి భద్రత పరికరాలు అందజేస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థులు

ఓదెల : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఓదెల, జూన్ 14: పొత్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కండెం వైష్ణవి,ఫాసియా తబస్సుమ్‌లు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)లను సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచి స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్షిప్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులను హెచ్ఎం సాంబయ్య, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్,జూన్ 14: గర్రెపల్లి మోడల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు సాక్షిత్, విజయచేతన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ.48వేలు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణితశాస్త్ర ఉపాధ్యాయుడు గన్నేరువరం శ్రీనివాస్‌తో పాటు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం అభినందించారు.

కేశోరాం గుర్తింపు సంఘం ఎన్నికలకు గుర్తుల కేటాయింపు

పాలకుర్తి, జూన్14: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలకు బరిలో ఉన్న అభ్యర్థులకు శుక్రవారం ఎన్నికల అధికారి బీ డానియల్ గుర్తులు కేటాయించారు. కాల్వ నరేశ్ (చేతిలో చెయ్యి), మాదాసు శ్రీనివాస్ (మోటార్‌సైకిల్), నగునూరి రమేశ్ (ఆటో), పొన్నవేని సదయ్య (ధర్మచక్రం) గుర్తులను కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 18న కేశోరాం కర్మాగారం ఆవరణలో పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని, అందరూ సహకరించాలని ఎన్నికల అధికారి కోరారు. గుర్తుల కేటాయించడంతో బరిలో ఉన్న నలుగురు అభ్యర్థులు కర్మాగారంతో పాటు, వర్కర్స్‌కాలనీ, గుట్ట క్వార్టర్లు, పాలకుర్తి, ఈసాల తక్కళ్లపల్లి, కన్నాల, జీడీనగర్, జయ్యారం, రాగినేడు, బ్రాహ్మణపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో కార్మికుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

పోస్టర్ విడుదల

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 14: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16తేదిల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న న్యాయవాదుల రాష్ట్రస్థాయి వృత్తి శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్‌ను గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం విడుదల చేశారు. ఏఐఎల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కేంద్ర కమిటీ సభ్యురాలు చందాల శైలజ, గోశిక ప్రకాశ్, ఎరుకల ప్రదీప్ కుమార్, సానం మురళి, భానుకృష్ణ, దాదా సలాం, రేష్మ, సుజాత, షానవాజ్, ప్రవళిక, మార్కపురం తిలక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

మిషన్‌భగీరథ పనులపై సర్వే

ముత్తారం. జూన్ 11: ఇప్పలపల్లి, సీతంపల్లి, ఖమ్మంపల్లి లో మిషన్‌భగీరథ పనులపై ఇంటింటా సర్వే చేసినట్లు ఎంపీడీవో జీ లలిత తెలిపారు. గ్రామంలో తిరుగుతు నల్లా కనెక్షన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎంపీవో వేణుమాధవ్, కార్యదర్శులు నరేశ్, శ్యామ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్, జూన్ 14: బ్రాహ్మణపల్లి, అప్పన్నపేటలో ఇంటింటికి మిషన్‌భగీరథ పనుల సర్వేను ఎంపీవో సుదర్శన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రామగిరి, జూన్ 15: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ సూచించారు. బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో శైలజ రాణి, డాక్టర్ ప్రదీప్ తో కలిసి ఆమె హాజరయ్యారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల సాధారణ జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అధికారులు రృలు చేపడుతున్నారని అన్నారు. గ్రామస్తలు కూడా సహకరించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 14: సింగరేణి ఆర్జీ–2 ఏరియా అధికారులు, సిబ్బందికి విద్యుత్ ప్రమాదాల నివారణపై డీఎంఎస్ రాజీవ్ వర్మ శుక్రవారం అవగాహన కల్పించారు. ముందుగా జీఎం సూర్యనారాయణ, సేఫ్టీ జీఎం గుప్తాలతో సమావేశమై విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా వివరించారు. కొన్ని రోజుల క్రితం ఓసీపీ–3లో జరిగిన ప్రమాదాన్ని ఉటంకిస్తూ భవిష్యత్‌లో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అధికారులు మధుసూదన్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు, రవీందర్, నరసింహారావు, ఎర్రన్న, రమేశ్,రవికిరణ్ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ

పాలకుర్తి, జూన్14: భామ్లానాయక్‌తండా గ్రామాన్ని ఆనుకొని ఉన్న కోళ్లఫారం నుంచి దుర్వాసన, దోమలు, ఈగలు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎంపీవో షబ్బీర్ జీపీ భవనంలో శుక్రవారం విచారణ జరిపారు. కోళ్ల ఫారం గ్రామానికి అతిసమీపంలో ఉండడంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు విచారణాధికారికి వివరించారు. ఉన్నతాధికారులకు సమాచారం తెలిపి, చర్యలు తీసుకుంటామని ఎంపీవో పేర్కొన్నారు. ఇక్కడ గ్రామస్తులు బదావత్ శంకర్‌నాయక్, మూడ్ శివకుమార్, ఇస్లావత్ రాజేశ్, బదావత్ రాజేష్, అంజినాయక్, జైపాల్, బాలు, జూంకి, శేఖర్, రవి, సమ్మయ్య, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పుట్ట శైలజ ఎన్నిక చెల్లదు'

మంథని/ సైదాబాద్, జూన్ 14 : ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు నమోదు చేసిన మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ ఎన్నిక చెల్లదంటూ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టు సంచలన తీర్పు ఇచ్చినట్లు హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ వెల్లడించారు. సైదాబాద్ కల్యాణ్ నగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 2020లో జరిగిన మంథని మున్సిపల్ ఎన్నికల్లో రెండో వార్డు నుంచి పోటీ చేసి గెలిచిన పుట్ట శైలజ తన అఫిడవిట్‌లో ఆస్తులకు సంబంధించి తప్పుడు వివరాలు సమర్పించారని స్థానిక కౌన్సిలర్‌గా పోటీ చేసిన సయిదా ఆయేషా ఫాతిమా కరీంనగర్ కోర్టు, ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. న్యాయవాది వామన్‌రావు దంపతుల హత్య అనంతరం ఈ కేసును హైదరాబాద్‌కు మార్చాలని కోరానని, అప్పుడు రంగారెడ్డి జిల్లా కోర్టుకు బదిలీ చేశారని చెప్పారు. విచారణ అనంతరం శైలజ ఎన్నిక చెల్లదంటూ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి సంచలన తీర్పు చెప్పారని అన్నారు. ఈ తీర్పుతో ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చే వ్యక్తులకు కన్నువిప్పు కలుగుతుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మంథనిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కింది స్థాయి వాళ్లను కించపర్చి పైకి ఎదిగే వాళ్లకు కోర్టు ఇచ్చిన తీర్పు తగిన గుణపాఠమని ఫిర్యాదుదారు సయిదా అయేషా ఫాతిమా అన్నారు.

సాంకేతిక పద్ధతులు పాటించండి

రామగిరి, జూన్ 14: వరి సాగు విధానంలో రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మురళి అన్నారు. రామగిరి ఖిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా డ్రమ్ సీడర్ విధానంపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. డ్రమ్ సీడర్ సాంకేతికతను ఉపయోగించి వరి సాగులో మెలకువల పై రైతులకు వివరించారు. కేటీకే శాస్త్రవేత్త డాక్టర్ వై వెంకన్న మాట్లాడారు. ఈ సాంకేతికతతో 15 రోజుల ముందుగానే పంట చేతికి అందుతుందన్నారు. శాస్త్రవేత్తలు భాస్కర్ రావు, డాక్టర్ కిరణ్ పిళ్లై, డాక్టర్ వినోద్ కుమార్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈపీ ఆపరేటర్ల ఎంపిక

రామగిరి, జూన్ 14: ఈపీ ఆపరేటర్ల ట్రైనింగ్ ప్రాక్టికల్ అంతర్గత పరీక్షలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు అన్నారు. జీఎం కార్యాలయంలో ఈపీ ఆపరేటర్ల ట్రైనింగ్ పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆర్జీ–2,3, ఏపీఏ ఏరియాల్లోని సింగరేణి ఉద్యోగులు 332 మంది ఈపీ ఆపరేటర్ల పరీక్ష కోం దరఖాస్తు చేసుకోగా హాల్‌టికెట్లు జారీ చేశామని చెప్పారు. అభ్యర్థులకు సెంటినరీకాలనీలోని రాణీ రుద్రమదేవి స్టేడియంలో ఈనెల 18 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రఘుపతి, సేఫ్టీ అధికారి వెంకటరమణ, పీఓ రాజేందర్, డీజీఎం చంద్రశేఖర్, సివిల్ డీజీఎం పద్మరాజు, పీఎం రవీందర్ రెడ్డి, ఎస్ఓ లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు ఉన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న విప్

ధర్మారం,జూన్14: నంది మేడారం గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు ఎల్తూరి సత్తయ్య కుటుంబాన్ని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. రెండో రోజుల క్రితం పీహెచ్‌సీలో పనులు చేస్తుండగా సూచిక బోర్డు పడి సత్తయ్య చనిపోయాడు. డీపీవో ఆశాలతతో కలిసి విప్ లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి